నమస్తే తెలంగాణ
Telangana Today

నిపుణ



# బెయిల్‌కు సీఆర్‌పీసీ బేడీలకు బీఎన్‌ఎస్‌ఎస్



**భారతీయ నాగరిక్ సురక్షా (రెండవ) సంహిత (ఇండియన్ సివిల్ ప్రొటెక్షన్ కోడ్) జూలై 1నుంచి అమల్లోకి రానున్నది. 2023, ఆగస్టు 11న కేంద్ర హోం మంత్రి అమిత్ షా లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దీన్ని డిసెంబర్ 23న ఉపసంహరించుకొని, స్టాండింగ్ కమిటీ పరిశీలించి చేసిన కొన్ని సిఫారసులను ఇందులో చేర్చి భారతీయ నాగరిక్ సురక్ష (రెండవ) సంహిత 2023 పేరుతో డిసెంబర్ 12న లోక్‌సభలో కేంద్రం ప్రవేశపెట్టింది. డిసెంబర్ 20న లోక్‌సభ, 21న రాజ్యసభ ఈ బిల్లుకు ఆమోదం తెలుపగా డిసెంబర్ 25న రాష్ట్రపతి దీనికి ఆమోదముద్ర వేశారు.**

## భారతీయ నాగరిక్ సురక్షా (రెండవ)సంహిత2023

### సత్వర న్యాయానికి పెద్దపీట

- వేగంతోపాటు సమర్థవంతంగా పనిచేసే న్యాయవ్యవస్థ ఉత్తమ పరిపాలనలో భాగం. సంక్లిష్టమైన లీగల్ ప్రక్రియల కారణంగా నేడు కోర్టుల్లో క్రిమినల్ కేసులు పెద్దసంఖ్యలో పెండింగ్‌లో ఉంటున్నాయి. కేసుల్లో దోష నిర్ధారణ చాలా తక్కువ స్థాయిలో ఉండటం, లీగల్ వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని తగినంతగా వినియోగించకపోవడం, దర్యాప్తులో విపరీత జాప్యం, ఫోరెన్సిక్‌ను అవసరమైన రీతిలో ఉపయోగించకపోవడం వంటివి సత్వర న్యాయ నిర్ణయానికి పెద్ద అడ్డంకులుగా మారాయి. వీటివల్ల నిరుపేదల జీవితాలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇటువంటి సమస్యల పరిష్కారానికి పౌరులే కేంద్రంగా క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ కొనసాగించడం తక్షణావసరం. 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్' మంత్రంతో ముందుకు సాగుతున్న కేంద్ర ప్రభుత్వం ప్రతి పౌరుడికి సత్వర న్యాయం అందించడానికి కృతనిశ్చయంతో ఉన్న నేపథ్యంలో క్రిమినల్ చట్టాల ఫ్రేమ్‌వర్క్‌ను సమగ్రంగా సమీక్షించి, అందరికి అందుబాటులో వుండే, సత్వర న్యాయాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనికోసం 1973 నాటి కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష (రెండవ) సంహిత (ఇండియన్ సివిల్ ప్రొటెక్షన్ కోడ్) పేరుతో కొత్త చట్టాన్ని తీసుకు వచ్చింది.
- ఇండియన్ పీనల్ కోడ్, మరే ఇతర క్రిమినల్ నేరాలకు సంబంధించిన చట్టాల పరిధి కిందికి వచ్చే కేసుల్లో నిందితుడి అరెస్ట్, దర్యాప్తు, పరిశోధన, నేర విచారణ విధానాలను కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్1973 నియంత్రిస్తుంది. క్రిమినల్ కేసుల్లో విచారణ జరపడానికి అవసరమైన యంత్రాంగాన్ని ఈ కోడ్ సమకూరుస్తుంది. ఫిర్యాదు నమోదు, విచారణ జరపడం, ఆదేశాలు జారీ చేయడం, ఈ ఆదేశాలకు వ్యతిరేకంగా అప్పీలును దాఖలు చేయడం వంటి ప్రక్రియలకు అవసరమైన విధానాలు ఈ కోడ్‌లో పొందుపరిచి ఉన్నాయి. ఇదిలా ఉండగా నేరంపై దర్యాప్తు, సమాచారాన్ని సేకరించి సమర్పించడం, సమన్లు జారీ చేయడం వంటి అంశాల్లో సాంకేతికత, ఫోరెన్సిక్ సైన్సును వినియోగించడానికి నూతన చట్టం వెసులుబాటు కల్పిస్తుంది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ సమాచార సదుపాయాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవచ్చు. దర్యాప్తునకు, విచారణకు, తీర్పు చెప్పడానికి నియమిత కాలాన్ని నిర్దేశించడం బీఎన్‌ఎస్‌ఎస్2లోని ప్రత్యేకత. బాధితులకు ఎఫ్.ఐ.ఆర్. కాపీని అందజేయడం, దర్యాప్తులో ప్రగతిని డిజిటల్ మాధ్యమం ద్వారా ఎప్పటికప్పుడు వారికి తెలియజేయాలని ఈ చట్టం నిర్దేశిస్తున్నది. ఏడు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ శిక్ష పడే కేసుల్లో ప్రభుత్వం కేసును ఉపసంహరించుకునే ముందు, బాధితులకు దీని గురించి వినే అవకాశాన్ని కల్పించడాన్ని ఈ చట్టం తప్పనిసరి చేసింది. పెట్టీ తక్కువ తీవ్రత కలిగిన కేసుల్లో శీఘ్ర విచారణ జరపాలని బీఎన్‌ఎస్‌ఎస్2 స్పష్టం చేస్తున్నది. నిందితుడిని వీడియో కాన్ఫరెన్స్ వంటి ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా విచారించవచ్చు. ఇందుకు అనుగుణంగా మెజిస్టీరియల్ లైన్‌ను కూడా క్రమబద్ధీకరించారు.

### ఫోరెన్సిక్‌కు ప్రాధాన్యం

- ముఖ్యంగా ఏడేళ్లు అంతకంటే ఎక్కువ శిక్ష పడే కేసుల్లో బీఎన్‌ఎస్‌ఎస్2 ఫోరెన్సిక్ విచారణను నిర్దేశిస్తుంది. ఇటువంటి కేసుల్లో ఫోరెన్సిక్ నిపుణులు సంఘటనా స్థలానికి వచ్చి, ఫోరెన్సిక్ సాక్ష్యాలను సేకరించి వివరాలు నమోదు చేయాలి. అన్ని రకాల విచారణలు, దర్యాప్తులు, న్యాయ ప్రక్రియలు ఎలక్ట్రానిక్ పద్ధతిలోనే కొనసాగించాలి. డిజిటల్ సాక్ష్యాలను కలిగివుండే ఎలక్ట్రానిక్ సమాచార పరికరాలను దర్యాప్తు, విచారణలో అనుమతిస్తారు. ఒకవేళ నేరస్థుడు విచారణను తప్పించుకోవడానికి పారిపోయి ఇప్పట్లో అరెస్ట్ సాధ్యం కాకపోతే అతని పరోక్షంలోనే విచారణ కొనసాగించేందుకు ఈ నూతన చట్టం అనుమతిస్తుంది. దర్యాప్తు, న్యాయ ప్రక్రియల్లో, మాదిరి సంతకాలు (స్పెసిమెన్ సిగ్నేచర్లు), వేలి ముద్రలు, కంఠస్వర నమూనాలను సేకరించవచ్చు. ఇంకా అరెస్ట్ చేయని వ్యక్తి నుంచి కూడా పై నమూనాలను సేకరించవచ్చు.
- బీఎన్‌ఎస్‌ఎస్2, పదిహేను రోజుల పోలీసు కస్టడీకి అనుమతిస్తుంది. మొత్తం 60 నుంచి 90 రోజుల వరకు విధించే జ్యుడీషియల్ కస్టడీలో తొలి 40 నుంచి 60 రోజుల కాలంలో పోలీసు కస్టడీని పదిహేను రోజుల పాటు విడతలుగా విధించవచ్చు. ఈ మొత్తం కాలంలో ఒకవేళ పోలీసులు తమ కస్టడీ కాలాన్ని ముగించకపోతే నిందితుడికి బెయిల్ లభించే అవకాశం ఉండదు. నేర కార్యకలాపాల ద్వారా సంపాదించిన ఆస్తిని జప్తు చేసే అధికారాలకు, మనీలాండరింగ్ నిరోధక చట్టంలో పేర్కొన్న రక్షణలు ఏవీ ఉండవు. ఒక కేసులో అరెస్టయిన నిందితుడు, ఆ నేరానికి విధించే శిక్షలో సగానికంటే ఎక్కువకాలం నిర్బంధంలో గడిపితే, అతనికి బెయిల్ ఇవ్వడానికి సి.ఆర్.పి.సి. అనుమతిస్తుంది. అయితే ఎక్కువ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడికి బీఎన్‌ఎస్‌ఎస్2 బెయిల్ అనుమతించదు. వివిధ కేసులు, వేర్వేరు సెక్షన్ల కింద నమోదై ఉండటం వల్ల బెయిల్ ఇచ్చే పరిధి కుంచించుకు పోతుంది. వ్యవస్థీకృత నేరాలు, సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించిన కేసుల్లో నిందితులకు బేడీలు వేయడానికి ఈ చట్టం అనుమతిస్తుంది. ప్రజల భద్రతకు సంబంధించి సి.ఆర్.పి.సి.లో పేర్కొన్న నిబంధనలను బీఎన్‌ఎస్‌ఎస్2లో యథాతథంగా ఉంచారు. విచారణ ప్రక్రియ, ప్రజల భద్రత అనేవి ప్రత్యేకమైన క్రియలు కనుక, వీటిని ఒకే చట్టం కింద లేక వేర్వేరు చట్టాల కింద నియంత్రించాలా, అనే విషయం ఇంకా ప్రశ్నార్థకంగానే ఉంది. సి.ఆర్.పి.సి.లో మార్పుల విషయంలో గతంలో నియమించిన ఉన్నత స్థాయి కమిటీలు, శిక్షలు, నిందితుల హక్కుల విషయంలో చేసిన సిఫారసులను బీఎన్‌ఎస్‌ఎస్2లో చేర్చలేదు.

### సి.ఆర్.పి.సి.లో మార్పులు

- నిజానికి ఇండియన్ పీనల్ కోడ్ (1860) నిర్వహణ కోసం కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సి.ఆర్.పి.సి) పేరుతో విధాన సంబంధ చట్టాన్ని 1973లో కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. నేరాలకు సంబంధించిన దర్యాప్తు, విచారణ, బెయిల్ మంజూరు వంటి అంశాలను ఇది వివరిస్తుంది. సి.ఆర్.పి.సి. మొట్టమొదటిసారి మనదేశంలో 1861లో అమల్లోకి తెచ్చారు. ముఖ్యంగా బహుళ చట్టవ్యవస్థలు అమల్లో ఉన్న నేపథ్యంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారం కోసం సి.ఆర్.పి.సి. రూపకల్పన జరిగింది. తర్వాతి కాలంలో అనేక సార్లు దీనిలో సమయానుకూలంగా మార్పులు చేసుకుంటూ వచ్చారు. చివరకు 1973లో సి.ఆర్.పి.సి.ని రద్దుచేసి, యాంటిసిపేటరీ బెయిల్ వంటి కొత్త అంశాలతో నూతన సి.ఆర్.పి.సి.ని కేంద్రం అమల్లోకి తెచ్చింది. 2005లో మళ్లీ దీన్ని కేంద్ర ప్రభుత్వం సవరించి, 'ప్లీ ఆఫ్ బార్గెయినింగ్', అరెస్టయిన వ్యక్తుల హక్కులు వంటి అంశాలను చేర్చింది. సంవత్సరాలుగా సుప్రీంకోర్టు సి.ఆర్.పి. సి.కి విభిన్న మార్గాల్లో వ్యాఖ్యానించడమే కాకుండా దీని అనువర్తనాన్ని సవరిస్తూ వచ్చింది. వీటిల్లో ముఖ్యమైనవి

1. విచారణకు అర్హమైన కేసుల్లో ఎఫ్.ఐ.ఆర్. నమోదు తప్పనిసరి
2. ఏడేళ్ల కంటే తక్కువ శిక్ష పడే కేసుల్లో అరెస్ట్ మినహాయింపు
3. బెయిల్ ఇవ్వదగిన నేరాల్లో బెయిల్ తప్పనిసరిగా మంజూరు చేయాలి.

- ఇవే కాకుండా కస్టడీల్లో చేసే విచారణకు సంబంధించిన మార్గదర్శకాలను కూడా సుప్రీంకోర్టు పేర్కొంది. ఇదే సమయంలో విచారణ మరింత వేగంగా జరగాలన్న అంశాన్ని నొక్కి చెప్పింది. అయినప్పటికీ బ్యాక్‌లాగ్‌లు, విచారణలో ఆలస్యం వంటి సమస్యలు నేరన్యాయ వ్యవస్థలో కొనసాగుతూనే ఉన్నాయి.

## సి.ఆర్.పి.సిలోని ముఖ్యాంశాలు

**నేరాల విభజన:** సి.ఆర్.పి.సి నేరాలను రెండు రకాలుగా విభజించింది. మొదటిది గుర్తించదగినవి కాగా రెండవది గమనార్హం కానివి. గుర్తించదగిన కేసుల్లో పోలీసులు నిందితుడిని ఏ విధమైన వారెంట్ లేకుండా అరెస్ట్ చేసి విచారించవచ్చు. అదే గమనార్హం కాని కేసుల్లో వారెంట్ తప్పనిసరి. కొన్ని కేసుల్లో బాధితుడు లేదా థర్డ్ పార్టీ ఫిర్యాదు చేయవచ్చు.

**నేరాల స్వభావం:** సి.ఆర్.పి.సి. వివిధ రకాల క్రిమినల్ నేరాలను వివరించింది. ఇవి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన నుంచి హత్య వరకు ఉన్నాయి. ఇందులో బెయిల్ ఇవ్వదగ్గ, బెయిల్ నిరాకరించే నేరాల మధ్య తేడాను స్పష్టంగా వివరించివుంది. పోలీసు కస్టడీలో ఉన్న నిందితుడు ఏయే నేరాల్లో బెయిల్ పొందే హక్కు కలిగి ఉంటాడో కూడా ఇందులో పేర్కొనిఉంది.

## బీఎన్‌ఎస్‌ఎస్2లో చేసిన మార్పులు చేర్పులు

**విచారణ ఖైదీలు:** ఒక కేసులో విధించే శిక్షాకాలంలో సగం కంటే ఎక్కువ సమయం నిర్బంధంలో ఉన్న నిందితుడిని వ్యక్తిగత పూచీకత్తుపై తప్పనిసరిగా విడుదల చేయాలి. అయితే మరణశిక్ష పడే కేసుల్లో నిందితులకు ఇది వర్తించదు. బీఎన్‌ఎస్‌ఎస్2 దీనికి అదనంగా కొన్ని అంశాలను చేర్చింది.

1. జీవితఖైదు విధించే నేరాలు
2. ఒక వ్యక్తిపై ఒకటికంటే ఎక్కువ కేసులు విచారణలో ఉన్నప్పుడు, ఈ రకమైన విడుదల సాధ్యం కాదని స్పష్టం చేసింది.

**వైద్య పరీక్షలు:** అత్యాచారంతో సహా వివిధ కేసులకు వైద్య పరీక్షలను సి.ఆర్.పి.సి. అనుమతిస్తోంది. కనీసం ఎస్.ఐ. స్థాయి పోలీసు అధికారి అభ్యర్థన మేరకు నిందితులకు వైద్య పరీక్షలను రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీస్‌నర్ నిర్వహించవచ్చు. అయితే ఏ పోలీసు అధికారి అయినా వైద్య పరీక్షలకు అభ్యర్థించే అవకాశాన్ని బీఎన్‌ఎస్‌ఎస్2 కల్పిస్తుంది.

**ఫోరెన్సిక్ విచారణ:** కనీసం ఏడేళ్లు శిక్షపడే కేసుల్లో ఫోరెన్సిక్ విచారణను బీఎన్‌ఎస్‌ఎస్2 తప్పనిసరి చేసింది. ఇటువంటి కేసుల్లో నేరం జరిగిన ప్రదేశానికి ఫోరెన్సిక్ నిపుణులు వచ్చి, ఫోరెన్సిక్ సాక్ష్యాలను సేకరిస్తారు. తాము సేకరించిన వివరాలను మొబైల్ ఫోన్లు లేదా మరే ఇతర ఎలక్ట్రానిక్ పరికరంలోనైనా వారు రికార్డు చేయవచ్చు. ఏదైనా ఒక రాష్ట్రం అటువంటి ఫోరెన్సిక్ సదుపాయం కలిగిలేకపోతే, మరో రాష్ట్రంలో ఉన్న ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు.

**సంతకాలు, వేలిముద్రలు:** ఏ వ్యక్తినైనా సంతకం లేదా చేతి రాతను చూపాలని మేజిస్ట్రేట్ కోరేందుకు సి.ఆర్.పి.సి. అనుమతిస్తోంది. అయితే దీన్ని మరింత విస్తరించి ఒక వ్యక్తి వేలిముద్రలు, కంఠస్వర నమూనాలను కూడా తీసుకోవడానికి బీఎన్‌ఎస్‌ఎస్2 అనుమతించింది. ఇంకా అరెస్ట్ కాని వ్యక్తినుంచి ఈ నమూనాలను సేకరించేందుకు బీఎన్‌ఎస్‌ఎస్2 అనుమతిస్తుంది.




**విధానాల అమలుకు కాలవ్యవధులు:** వేర్వేరు విధానాలకు వివిధ కాలవ్యవధులను బీఎన్‌ఎస్‌ఎస్2 పేర్కొంది. ఉదాహరణకు అత్యాచార బాధితులను పరీక్షించిన మెడికల్ ప్రాక్టీస్‌నర్లు వారం రోజుల్లోగా దర్యాప్తు అధికారికి తమ నివేదికను అందజేయాలి. అదేవిధంగా, ఒక కేసులో వాదనలు పూర్తయిన తర్వాత న్యాయమూర్తి 30 రోజుల్లోగా తీర్పు చెప్పాలి (దీన్ని 45 రోజుల వరకు పెంచారు). దర్యాప్తులో పురోగతిని 90 రోజుల్లోగా బాధితులకు వెల్లడించాలి. నిందితుడిపై ఆరోపణలకు సంబంధించి తొలి వాదనలు విన్న తర్వాత 60 రోజుల్లోగా సెషన్స్ కోర్టు ఆరోపణల స్వరూపాన్ని రూపొందించాలి (ఫ్రేమింగ్ ది చార్జెస్).

**కోర్టుల అధికారక్రమం:** భారత్‌లో క్రిమినల్ వ్యవహారాల్లో తీర్పు చెప్పడంలో కోర్టుల అధికారక్రమాన్ని సి.ఆర్.పి.సి వివరించింది. అవి

1. **మేజిస్ట్రేట్ కోర్టులు:** చాలా క్రిమినల్ కేసులను విచారించే బాధ్యత ఉన్న సబార్డినేట్ కోర్టులు.
2. **సెషన్స్ కోర్టులు:** సెషన్స్ జడ్జి నేతృత్వం వహిస్తారు. మేజిస్ట్రేట్ కోర్టుల నుంచి అప్పీళ్లపై వాదనలు వింటారు.
3. **హైకోర్టులు:** క్రిమినల్ కేసులు, అప్పీళ్లపై వాదనలు విని నిర్ణయించే స్వాభావిక న్యాయపరిధి కలిగి ఉంటాయి.
4. **సుప్రీంకోర్టు:** హైకోర్టు నుంచి వచ్చిన అప్పీళ్లపై వాదనలు వింటుంది. కొన్ని అంశాలపై ఈ కోర్టుకు ప్రాథమిక న్యాయ పరిధి ఉంటుంది.

- పది లక్షలకు మించిన జనాభా కలిగిన నగరాలను మెట్రోపాలిటన్ ప్రాంతాలుగా ప్రకటించే అధికారాన్ని సి.ఆర్.పి.సి. ఆయా రాష్ట్రాలకు కల్పిస్తుంది. అటువంటి ప్రాంతాల్లో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్లు పనిచేస్తారు. అయితే మెట్రోపాలిటన్ ప్రాంతాలు, మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్లు అనే వర్గీకరణను బీఎన్‌ఎస్‌ఎస్2 తొలగించింది.

జమలాపురపు
విఠల్‌రావు
సీనియర్ జర్నలిస్ట్



# గుప్త రాజ్యాన్ని పాలించిన తొలి మహిళా నాయకురాలు?

**డీఎస్సీ ప్రత్యేకం**
**సోషల్ – హిస్టరీ**

1. **కింది వాక్యాలని గమనించండి.**
   ఎ. కర్ణాటకలోని చాళుక్యుల్లో ముఖ్యుడైన దంతిదుర్గుడు హిరణ్యగర్భ (బంగారు గర్భం) అనే సంస్కార విధిని నిర్వహించాడు. తద్వారా తాను పుట్టుకతో క్షత్రియుడు కాకున్నా క్రతువుతో పునర్జన్మ పొందుతానని భావించాడు
   బి. కదంబ మయూరశర్మ, గూర్జర ప్రతిహార హరిశ్చంద్రులు బ్రాహ్మణులు అయినప్పటికీ వారి సంప్రదాయ వృత్తులు వదిలి ఆయుధాలు చేతబట్టి కర్ణాటక, రాజస్థాన్‌లో రాజ్యాలేర్పరిచారు
   సి. శాసనాల్లో పేర్కొన్న మొదటి భాగాన్ని ప్రశస్తి అంటారు. స్వయంగా రాజే వీటిని రాసేవారు
   **పై వాక్యాల్లో సరికానివి గుర్తించండి?**
   1) ఎ, బి　2) బి, సి
   3) ఎ, సి　4) బి
2. **కింది వాక్యాల్లో సరికానిది గుర్తించండి.**
   ఎ. కశ్మీర్‌ను పాలించిన రాజుల చరిత్రపై 12వ శతాబ్దంలో అసాధారణమైన పెద్ద పద్యం సంస్కృతంలో కల్హణుడు తన రాజతరంగిణిలో రాశాడు
   బి. గంగానది లోయ ప్రాంతంపై నియంత్రణ కోసం గూర్జర ప్రతిహారులు, రాష్ట్రకూటులు, పాలవంశం రాజులు నిత్యం ఘర్షణ పడేవారు. దీన్నే త్రైపాక్షిక పోరాటం అంటారు
   సి. కితాబ్–అల్–హింద్ అనే గ్రంథం అల్ బెరూని రచించాడు. దీని ద్వారా గజిని ఆక్రమించుకొన్న ప్రాంతాల గురించి తెలుసుకోవచ్చు
   1) ఎ, బి　2) బి, సి
   3) ఎ, బి, సి　4) పైవేవీ కావు
3. **కింది వాక్యాలను గమనించి కాలానుగుణంగా అమర్చండి.**
   ఎ. చౌహాన్ వంశస్థుడైన పృథ్వీరాజ్–3, మహ్మద్ ఘోరీ మధ్య తరైన్ యుద్ధం జరిగింది
   బి. గజినీ మహమ్మద్ తన దండయాత్రలో సోమనాథ్ ఆలయంతో సహా అనేక సంపన్న దేవాలయాలు దోచుకున్నాడు
   సి. పల్నాటి వీరుల చరిత్రను శ్రీనాథుడు రచించాడు
   1) ఎ, బి, సి　2) బి, ఎ, సి
   3) సి, బి, ఎ　4) సి, ఎ, బి
4. **కింది వాటిని జతపరచండి.**
   1. వెల్లన్ వాగై　ఎ. బ్రాహ్మణేతర రైతులకు చెందిన భూమి
   2. బ్రహ్మదేయ　బి. బ్రాహ్మణులకు బహూకరించిన భూమి
   3. శాలభోగ　సి. పాఠశాల నిర్వహణకు ఉపయోగించే భూమి
   4. తిరునామత్తుకని　డి. దేవాలయాలకు బహూకరించిన భూమి
   5. పళ్లిచ్ఛందం　ఇ. జైన సంస్థలకు విరాళమిచ్చిన భూమి
   1) 1–ఎ, 2–సి, 3–డి, 4–బి, 5–ఇ　2) 1–ఎ, 2–డి, 3–సి, 4–బి, 5–ఇ
   3) 1–ఎ, 2–డి, 3–సి, 4–బి, 5–ఇ　4) పైవేవీ కావు
5. **కింది వాక్యాల్లో కాలానుక్రమానుసారం అపసవ్యదిశలో కాకతీయ రాజుల్లో సరైనది గుర్తించండి.**
   1) రుద్రదేవుడు, ప్రోలరాజు–2, గణపతి దేవుడు, రుద్రమదేవి, ప్రతాపరుద్ర–2
   2) ప్రోలరాజు–2, రుద్రదేవుడు, గణపతి దేవుడు, రుద్రమదేవి, ప్రతాపరుద్ర–2
   3) ప్రతాపరుద్ర–2, రుద్రమదేవి, గణపతిదేవ, ప్రోలరాజు–2, రుద్రదేవ
   4) ప్రతాపరుద్ర–2, రుద్రమదేవి, గణపతిదేవ, రుద్రదేవ, ప్రోలరాజు–2
6. **కింది వాటిలో సరికానిది గుర్తించండి.**
   ఎ. విద్యానాథుని క్రీడాభిరామం, వినుకొండ వల్లభరాయుని ప్రతాపరుద్ర యశోభూషణం, ఏకామ్రనాథుని ప్రతాపరుద్రచరిత్రలు కాకతీయుల పాలనా కాలం నాటివి
   బి. శాసనాలు, సాహిత్యాధారాల ప్రకారం కాకతీయ వంశ మూలపురుషుడు దుర్జయ వీరిని ఆంధ్రరాజులు అని కీర్తించారు
   సి. కాకతీయులు మొదటగా చాళుక్యుల వద్ద తర్వాత రాష్ట్ర కూటుల వద్ద సామంతులుగా పనిచేసి రట్టడిలుగా నియమితులై తర్వాత తెలంగాణలోని అనుమకొండని పొందారు
   డి. గణపతి దేవుని కాలంలో వీరి రాజధాని అనుమకొండ నుంచి ఓరుగల్లుకు మార్చబడింది
   1) ఎ, బి　2) ఎ, డి
   3) బి, సి　4) ఎ, బి, సి
7. **కాకతీయ రాజులు – పాలనా కాలాన్ని జతపరచండి.**
   1. రుద్రదేవుడు　ఎ. 1116 – 1157
   2. గణపతిదేవ　బి. 1199 – 1262
   3. ప్రోల –2　సి. 1289 – 1323
   4. రుద్రమదేవి　డి. 1158 – 1195
   5. ప్రతాపరుద్ర –2　ఇ. 1262 – 1289



   1) 1–డి, 2–ఎ, 3–బి, 4–ఇ, 5–సి
   2) 1–డి, 2–ఎ, 3–బి, 4–సి, 5–ఇ
   3) 1–డి, 2–బి, 3–ఎ, 4–ఇ, 5–సి
   4) 1–డి, 2–బి, 3–ఎ, 4–సి, 5–ఇ
8. **కింది వాక్యాలను పరిశీలించి సరికానివి గుర్తించండి.**
   ఎ. భారత చరిత్రలో ప్రభావతి గుప్త రాజ్యాన్ని పాలించిన తొలి మహిళా నాయకురాలు
   బి. ఢిల్లీని పాలించిన తొలి మహిళా నాయకురాలు ఇల్‌టుట్‌మిష్ కూతురు
   సి. ప్రముఖ ఇటాలియన్ యాత్రికుడు మార్కోపోలో రుద్రమదేవి రాజ్యాన్ని సందర్శించి ఆమె పాలనా, ధైర్యసాహసాలను కొనియాడారు
   డి. శాసనాల ప్రకారం రుద్రమదేవిని రుద్రదేవ మహారాజుగా కీర్తించారు. కానీ ఆమె తన సామంతుల్లో ఒకరైన కాయస్థ అంబదేవుని తిరుగుబాటులో నల్లగొండలోని చందుపట్ల యుద్ధంలో మరణించారు
   1) ఎ, బి　2) ఎ, బి, సి
   3) ఎ, బ, సి, డి　4) పైవేవీ కావు
9. **విజయనగర రాజుల చరిత్రకకు సంబంధించి విదేశీ సాహిత్య ఆధారంగా విదేశీ యాత్రికులు సందర్శించిన కాలాలతో గుర్తించండి.**
   1. ఇటలీ యాత్రికుడు నికోలోకాంటి　ఎ. 1520
   2. పర్షియన్ యాత్రికుడు/వర్తకుడు అబ్దుల్ రజాక్　బి. 1440
   3. పోర్చుగీస్ యాత్రికుడు డొమింగో పేజ్　సి. 1443
   4. పోర్చుగీస్ యాత్రికుడు న్యూనిజ్　డి. 1537
   1) 1–బి, 2–ఎ, 3–సి, 4–డి　2) 1–సి, 2–బి, 3–ఎ, 4–డి
   3) 1–బి, 2–సి, 3–ఎ, 4–డి　4) 1–బి, 2–ఎ, 3–డి, 4–సి
10. **కింది ప్రతిపాదనల్లో సరైనవి గుర్తించండి.**
   ఎ. మాలిక్ కాఫర్‌చే బంధింపబడి బలవంతంగా మతమార్పిడి చేయబడ్డ హరిహర, బుక్కరాయలు అల్లా ఉద్దీన్‌ఖిల్జీ మరణాంతరం దక్షిణ భారతం తిరుగు ప్రయాణమయ్యారు
   బి. హిందూమత సామ్రాజ్య స్థాపన కోసం ఆ ఇరువురు సోదరులు తుంగభద్ర నది తీరాన విద్యారణ్య స్వామి ఆశీస్సులతో 1336లో విజయనగరాన్ని స్థాపించారు
   1) (ఎ) సరైనది, (బి) తప్పు
   2) (బి) సరైనది, (ఎ) తో సంబంధం లేదు
   3) (ఎ), (బి) తప్పు ఒకదానికి ఇంకొకటి బలపరచలేవు
   4) ఎ, బి సరైనవే, (ఎ) ని (బి) బలపరుస్తుంది

**జవాబులు**

| | | | |
|---|---|---|---|
| 1.3 | 2.4 | 3.2 | 4.4 |
| 5.4 | 6.2 | 7.3 | 8.4 |
| 9.1 | 10.4 | | |

మామిళ్ల
కళ్యాణ్ గౌడ్
ఏకేఆర్ స్టడీ సర్కిల్
వికారాబాద్



# 'ఎస్‌ఎస్‌సీ' 8326 ఖాళీలు

- **పదోతరగతితో కేంద్రంలో కొలువులు**
- **ఎంటీఎస్, హవల్దార్ పోస్టులు**
- **తెలుగు, ఉర్దూలో కూడా పరీక్ష రాయవచ్చు**

- కేంద్రంలోని వివిధ మంత్రిత్వ శాఖలు/కార్యాలయాల్లో కింది పోస్టుల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్‌ఎస్‌సీ) ప్రకటన విడుదల చేసింది.
- **మొత్తం ఖాళీలు:** 8326
- **పోస్టుల వారీగా ఖాళీలు:** మల్టీ టాస్కింగ్ (నాన్ టెక్నికల్) స్టాఫ్ – 4887, హవల్దార్ (గ్రూప్ సీ నాన్ మినిస్టీరియల్)–3439 ఖాళీలు ఉన్నాయి
- **అర్హతలు:** గుర్తింపు పొందిన బోర్డు/సంస్థ నుంచి పదోతరగతి లేదా మెట్రిక్యులేషన్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన వారు అర్హులు
- **వయస్సు:** 2024, ఆగస్టు 1 నాటికి ఎంటీఎస్ పోస్టులకు 18–25 ఏండ్లు, హవల్దార్ పోస్టులకు 18– 27 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

**ఎంపిక విధానం**

**ఎంటీఎస్ పోస్టులకు**

- కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్‌ను నిర్వహిస్తారు

**హవల్దార్ పోస్టులకు**

- కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ (పీఈటీ)/ ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ (పీఎస్‌టీ) ద్వారా
- కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్‌ను ఇంగ్లిష్/హిందీతోపాటు 13 స్థానిక భాషల్లో కూడా నిర్వహిస్తారు.
- తెలుగులో కూడా పరీక్ష రాయవచ్చు
- ఈ పరీక్ష ఆబ్జెక్టివ్ టైప్, మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటుంది.
- సీబీఈలో రెండు సెషన్లు ఉంటాయి.
- మొదటి సెషన్‌లో న్యూమరికల్ అండ్ మ్యాథమెటికల్ ఎబిలిటీ, రీజనింగ్ ఎబిలిటీ ప్రాబ్లమ్ సాల్వింగ్‌పై ప్రశ్నలు ఇస్తారు
- పరీక్ష కాలవ్యవధి 45 నిమిషాలు.
- ప్రశ్నల సంఖ్య 40. మార్కులు 120
- సెషన్–2లో జనరల్ అవేర్‌నెస్ నుంచి 25 ప్రశ్నలు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్ నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. మొత్తం 150 మార్కులు. అంటే ఒక్క ప్రశ్నకు 3 మార్కులు.
- పరీక్ష కాలవ్యవధి 45 నిమిషాలు

**నోట్:** సెషన్–1లో నెగెటివ్ మార్కింగ్ విధానం లేదు. సెషన్–2లో నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది. ప్రతి తప్పు జవాబుకు ఒక మార్కును కోతవిధిస్తారు.

**పీఈటీ**

- హవల్దార్ పోస్టులకు నిర్వహించే పీఈటీలో పురుషులు 1600 మీటర్ల దూరాన్ని 15 నిమిషాల్లో నడవాలి. మహిళలు అయితే ఒక కిలోమీటరు దూరాన్ని 20 నిమిషాల్లో నడవాలి.

**ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ (పీఎస్‌టీ)**

- పురుషులు కనీసం 157.5 సెంమీ. ఎత్తు ఉండాలి. ఛాతీ 81 సెం.మీ. గాలి పీల్చినప్పుడు కనీసం ఐదు సెం.మీ వ్యాకోచించాలి.
- మహిళలు అయితే 152 సెం.మీ. ఎత్తు ఉండాలి. బరువు 48 కేజీలు ఉండాలి.

**ముఖ్యతేదీలు**

- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూలై 31
- **పరీక్ష తేదీలు:** అక్టోబర్/నవంబర్ 2024
- **రాష్ట్రంలో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కరీంనగర్, వరంగల్
- **వెబ్‌సైట్:** https://ssc.gov.in

## హెచ్‌సీఎల్‌లో...




హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.
**మొత్తం ఖాళీలు:** 56
**పోస్టులు:** జూనియర్ మేనేజర్
**విభాగాలు:** మైనింగ్, ఎలక్ట్రికల్, కంపెనీ సెక్రటరీ, ఫైనాన్స్, హెచ్‌ఆర్
**దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
**చివరితేదీ:** జూలై 22
**వెబ్‌సైట్:** www.hindustancopper.com